సాక్షి
తిరుపతి

శనివారం । 4 । అక్టోబర్ । 2025

I



పడకేసిన పల్లె వైద్యం
పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడంతో పల్లెల్లో వైద్యసేవలు పడకేశాయి. దీంతో రోగులు అవస్థలు పడ్డారు. - IIలో



జీఎస్టీ తగ్గింపుతో ఆదా
'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్'పై శ్రీసిటీలో ప్రజలు, వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. - IIలో



శిక్షణా తరగతులు ప్రారంభం
కొత్త ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై ప్రసంగించారు. - IIలో

న్యూస్‌రీల్

ముగిసిన డిగ్రీ రెండవ విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ

తిరుపతి సిటీ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో రెండవ విడత డిగ్రీ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఓఏఎమ్‌డీసీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శుక్రవారంతో ముగిసినట్లు తెలిపింది. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి సాధించిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రాతిపదికన ఈనెల 6వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 7, 8వ తేదీలలో ఆయా కళాశాలల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి అడ్మిషన్లు పొందాలని సూచించారు. రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు.

నేటితో ముగియనున్న పీజీ ఫైనల్ ఫేజ్ రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో పీజీసెట్-2025 రెండవ విడత (ఫైనల్ ఫేజ్) అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ఈ మేరకు ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. రెండవ, చివరి విడత అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఆయా కోర్సులకు సంబంధించి ఈనెల 6వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. అనంతరం పీజీ సెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రిజర్వేషన్లు, సాధించిన మార్కుల ఆధారంగా 8వ తేదీన సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈనెల 11వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మిగిలిన సీట్లకు త్వరలో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు.

జాతిపిత అడుగు జాడల్లో పయనిద్దాం



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మహాత్మా గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను రెండు వారాలు పాటు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారని తెలిపారు. ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛత అంశాలలో ఒక కొత్త అంశం తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాలు, నగరాలను స్వచ్ఛ ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనేది కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అంతక ముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గాంధీ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) నరసింహులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్యతో పాటు మున్సిపల్ అధికారులు, ఏవో రమేష్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ పరీక్షలు

తిరుపతి సిటీ : వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఇంటర్ విద్యామండలి ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. 23న ఫస్ట్ ఇయర్ పరీక్షలు, 24న ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. సాధారణ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి టైం టేబుల్ విడుదల చేశారని ఆయన తెలిపారు.

గజలక్ష్మి నమో నమామి



గజ వాహనంపై శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి : విజయదశమి సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు గురువారం గజ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. విజయదశమి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్‌సేవను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతి పాత్రమైన గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

చక్రస్నానం.. ముక్తి స్థానం



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు, చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు.. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవ యజ్ఞ సమాప్తికి గురువారం తిరుమల పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. వేల మంది భక్తుల గోవింద నామ స్మరణల మధ్య చక్రస్నానాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. అనంతరం రాత్రి జరిగిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. తెల్లవారుజామున శ్రీవరాహస్వామి ఆలయం చెంత పుష్కరిణిలో చక్రతాళ్వార్లకు స్నానం నిర్వహించే ముందు స్నపన తిరుమంజనం జరిగింది. శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామి వారి చెంత చక్రతాళ్వార్లకు అర్చకులు అభిషేక కైంకర్యాన్ని నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానం చేశారు.

ధ్వజావరోహణం

రాత్రి మలయప్ప స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో విహరించి ధ్వజస్తభం వద్దకు వేంచేశారు. ఇక్కడ గరుడునికి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా కిందకు దించారు. ఈ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తయ్యాయి.

భాగ్ సవారి

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటిరోజు భాగ్ సవారి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శుక్రవారం స్వామివారు సాయంత్రం వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకుని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న పండితులు



స్వామివారి భాగ్ సవారి

ఆత్మగౌరవానికి నిప్పు.. లేదా కనువిప్పు!

బానిస బతుకుల నుంచి విముక్తికి పోరాటం చేయడమే ఆయన చేసిన తప్పా...? పేద వాడు అందరితో పాటు సమానంగా తలెత్తుకు తిరాగాలనుకోవడమే ఆయనకు శాపంగా మారిందా...? సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలన్న ఆకాంక్షే ఆయన చేసిన నేరమా..? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు మహిళలకు తీసుకొచ్చిన రిజర్వేషన్ ఆ మహనీయుని పాలిట శత్రువైందా..?అంటే కూటమి పాలనలో అవుననే సమాధానం వస్తోంది. కూటమి కొలువుదీరినప్పటి నుంచీ అడుగడుగునా అవమానమే ఎదురవుతోంది. దళితుల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహాలకు నిప్పు పెట్టడం... చెప్పుల దండలు వేసి అవమానించడం రివాజుగా మారుతోంది. తమ ఆత్మగౌరవానికి నిప్పు పెడుతుంటే.. అధికారులు, నేతలకు కనువిప్పు లేదా..? అంటూ దళిత వర్గాలు మండిపడుతున్నాయి. వెదురుకుప్పం మండలం, దేవళంపేట ఘటనను తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగాయి.

- చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం దారుణం
- దళితుల ఆత్మగౌరవాన్ని కాల్చి వేస్తున్నారు
- నేడు విగ్రహానికి నిప్పు.. రేపు మమ్మల్ని ఏం చేస్తారో?
- ఆందోళనకు దిగిన దళిత సంఘాలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



కాలిన విగ్రహం



నగరి డీఎస్పీ కాళ్లు పట్టుకుంటున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: మండలంలో దారుణం చోటు చేసుకుంది. దళితుల ఆశాజ్యోతి, బడుగు, బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం కలకలం రేగింది. అగ్రవర్ణ దురహంకారులను అరెస్ట్ చేయాలంటూ దళిత వర్గాలు నిరసనకు దిగాయి.

అసలేం జరిగిందంటే!

దేవళంపేటలో స్థానిక సర్పంచ్ గోవిందయ్య 2023లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. దేవళంపేట-తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలంలో విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ స్థలాన్ని స్థానికంగా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. వారి ప్రయత్నాలను అడ్డుకుంటూ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అప్పట్లోనే పరోక్షంగా సర్పంచ్ గోవిందయ్యపై కొందరు టీడీపీ నేతలు భగ్గుమన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్ వద్దకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని టీడీపీ నేత సతీష్ నాయుడు కులం పేరుతో దూషించారు. అధికారం రావడంతో సర్పంచ్‌పై జిల్లా అధికారులకు ఫిర్యా దు చేసి చెక్ పవర్‌ను రద్దు చేయించారు. అంతటితో ఆగకుండా సర్పంచ్‌పై పలు కేసులు పెట్టించి వేధించారు. వాటన్నిటికీ వెరవకుండా వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన సతీష్ నాయుడు, అతని అనుచరులు కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టేందుకు పూనుకున్నారు.

ఉలిక్కిపడ్డ దళితులు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోలు పోసి తగలబెట్టారు. దీంతో ఒక్కసారిగా దళితులు ఉలిక్కిపడ్డారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఏకమయ్యారు. అగ్రవర్ణ దురహంకారుల దుశ్చర్యను ఖండించాయి. రేపు మమ్మల్ని ఏం చేస్తారోనని రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు.

నూతన విగ్రహావిష్కరణ



చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి దుండగులు నిప్పు పెట్టడంతో అదే స్థానంలో నూతన విగ్రహాన్ని అధికారులు ఆవిష్కరించారు. ఆగమేఘాల మీద అధికారులు కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఆది నుంచీ అరాచకమే



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ వారు చేస్తున్న అరాచకాలకు హద్దుల్లేవు. ఇది అన్యాయం అని ప్రశ్నిస్తే అడిగిన వాళ్లపైనే కేసులు నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోంది. అంబేడ్కర్ విగ్రహాలను కూల్చి వేయడం, చెప్పుల మాలలు వేసి అవమానించడం, నిప్పు పెట్టడం వంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. మహిళలు, వృద్ధులు, బాలికలు ఇలా అందరూ కూటమి పాలనలో దాడులకు గురవుతున్నారు. అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీలకే కాదు అందరికీ దారి చూపించాడు. ప్రతిక్కరికీ దైవ స్వరూపమైన అంబేడ్కర్‌కి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు.

– కే.కృపాలక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి

కాళ్లు పట్టుకుంటాం.. న్యాయం చేయండి

మీ కాళ్లు పట్టుకుంటాం.. ఇక మమ్మల్ని బతకనివ్వరు.. మాకు న్యాయం చేయండంటూ సర్పంచ్ గోవిందయ్య ఏకంగా నగరి డీఎస్పీ మహ్మద్‌అజీజ్ కాళ్లు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా చిత్తూరు ఎస్పీ తుషార్‌డూడిని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో కలిసి.. పోలీసుల వైఫల్యం, వారి తీరును ఎండగట్టారు. బందార్లపల్లె ఘటనను గుర్తుచేశారు. బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్‌కు జరిగిన అవమానాన్ని గుర్తుచేసి న్యాయం చేయాలని కోరారు. ఈనెల 25లోపు నిందితులను పట్టుకుని శిక్షించాలని సూచించారు.

దళితులకు అండగా వైఎస్సార్‌సీపీ



దళితులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చిత్తూరు జిల్లా దేవళంపేటలో జరిగిన ఘటనతో బడుగు బలహీనవర్గాలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలిచింది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మితో పాటు కార్వేటినగరం, పెనుమూరు, శ్రీరంగరాజపురం మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని నిందితుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎంతటి వారినైనా శిక్షించాలంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. న్యాయం జరగకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించాయి.

కలెక్టర్ ఆరా..



కలెక్టర్,ఎస్పీ,ఎమ్మెల్యేలు ఆరా

చిత్తూరు జిల్లా దేవళంపేట ఘటనపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆరా తీశారు. విషయం తెలిసిన వెంటనే ఘట నా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీసీ ఫుటేజీలు, ఫోన్ సంభాషణలు, అర్ధరాత్రి ఎవరు తిరిగారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు థామస్, మురళీ మోహన్ కూడా స్పందించారు. విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారు.

నైలెట్‌తో ఉపాధి

- ఎస్వీయూలో నైలెట్ ప్రారంభోత్సవంలో ఎంపీ గురుమూర్తి
- వర్చువల్ విధానంలో పాల్గొని ప్రారంభించిన కేంద్రమంత్రి



నైలెట్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ గురుమూర్తి

తిరుపతి సిటీ : నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్)తో స్థానిక యువతకు ఉన్నత స్థాయి ఉపాధి, ఉద్యోగాలు లభించే సువర్ణావకాశం ఉందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఎస్వీయూ ప్రాంగణంలో తాత్కాలిక భవనంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ వర్చువల్ విధానంలో ఈ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించగా ఎంపీ గురుమూర్తి, అధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ .. నైలెట్ శిక్షణ కేంద్ర ఎస్వీయూలో ప్రారంభించడంతో ఇందులో శిక్షణ పొందిన యువతకు ఆధునిక ఐటీ టెక్నాలజీతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రత్యేక శిక్షణ పొందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, నైలట్ సెంటర్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నైలెట్ సాధనలో ఎంపీ పాత్ర కీలకం

కేంద్ర శిక్షణ సంస్థ నైలెట్ సాధనలో తిరుపతి ఎంపీ పాత్ర కీలకమని అధికారులు, అధ్యాపకులు పేర్కొన్నారు. ఏడాదికి కనీసం 1000 మంది యువతకు పూర్తి స్థాయి అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉన్నత ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు.

ఐటీ శిక్షణతో పాటు షార్ట్ టర్మ్ కోర్సులు

నైలెట్ ఆవిర్భావం తిరుపతిలో సాంకేతిక శిక్షణకు సరికొత్త అడుగుపడింది. నైలెట్‌లో ఐటీ సంబంధిత శిక్షణతో పాటు వెబ్ డిజైనింగ్, పీసీ హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి షార్ట్‌టర్మ్ కోర్సులు అందించనున్నారు. అదనంగా, ఎంబీడెడ్ సిస్టమ్ డిజైన్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ ఫోరెన్సిక్స్, సెమికండక్టర్ డిజైన్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లోనూ యువతకు శిక్షణ లభించనుంది.

యుద్ధం గెలిచిన వీరుడు మిథున్

- చంద్రబాబు పైశాచిక ఆనందం కోసమే 71 రోజుల జైలు
- ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన భూమన కరుణాకరరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: సంగ్రామంలో నుంచి బయటకు వచ్చిన యుద్ధవీరుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బెయిల్‌పై వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని గురువారం తిరుపతి మారుతీనగర్‌లోని ఆయన నివాసంలో భూమన కరుణాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు పార్టీ కేడర్‌కి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ సీపీ అభ్యున్నతికి, జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి పడిన కష్టంపై ఎంపీ మిథున్‌రెడ్డిని అభినందించారు. లిక్కర్‌స్కామ్ అంటూ ఎంపీ మిథున్‌రెడ్డిని, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు మరి కొందరిపై అక్రమ కేసులు బనాయించి, జైళ్లకు పంపారన్నారు. చంద్రబాబు పైశాచిక ఆనందం కోసం ఎంపీ మిథున్‌రెడ్డిని 71రోజుల పాటు ఓ టెర్రరిస్టులా జైల్లో నిర్బంధించారన్నారు. జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపుల్లో భాగంగానే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. చంద్రబాబు పెట్టే అక్రమ కేసులకు బయపడే వారెవ్వరూ వైఎస్ఆర్ సీపీలో లేరని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల నియామకం




డాక్టర్ శిరీష యాదవ్, నీలం బాలాజీ

తిరుపతి కల్చరల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జిల్లాకు చెందిన నేతలను ఎంపిక చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా యల్లా సిరి గోపాల్‌రెడ్డి, పెర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి(గూడురు), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నీలం బాలాజీ, డాక్టర్ శిరీష యాదవ్(తిరుపతి), కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్, పి.మధుసూధన్‌రెడ్డి(వెంకటగిరి), కె.భక్తవత్సలరెడ్డి, వేమరెడ్డి కుమార్ స్వామిరెడ్డి(గూడూరు) నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన శశి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణ శివారు మిట్టకండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శశి(23) అనే యువకుడు దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి మండలం పెంకులపాడుకు చెందిన శశి బీటెక్ పూర్తి చేశాడు. సొంత పనుల నిమిత్తం శుక్రవారం బైక్‌పై వస్తుండగా మిట్టకండ్రిగ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడకేసిన పల్లె వైద్యం

- పీహెచ్‌సీల వైద్యుల ఆందోళన ఉధృతం
- డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యుల నిరసన
- జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో వైద్యం కోసం నిరీక్షించి వెనుదిరిగిన రోగులు
- ప్రభుత్వం దిగివచ్చే వరకు వెనక్కు తగ్గేది లేదంటున్న వైద్యులు

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసింది. కొన్ని రోజుల నుంచి పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పట్టించుకోకపోవడంతో సోమవారం నుంచి వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో వైద్య సేవలు స్తంభించిపోయాయి. దీంతో జిల్లాలోని పలు పీహెచ్‌సీలు సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేశారు. అత్యవసర సేవలు మాత్రం అక్కడక్కడా కొనసాగాయి. నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఆన్‌లైన్ సేవలు, రిపోర్టుల సమర్పణకు బంద్ పాటించారు. దీంతో పలు సేవలు స్తంభించాయి. పలుచోట్ల ప్రజలు చికిత్స అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది.

జిల్లా వ్యాప్తంగా సేవలు అంతంతే..

ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల సంఘం (ఏపీపీహెచ్సీడీఏ) పిలుపు మేరకు వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సేవలు స్తంభించి పోయాయి. గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి రూరల్ ప్రాంతాలలోని పీహెచ్‌సీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలకు విచ్చేసిన రోగులు తమకు ఇదివరకు ట్రీట్‌మెంట్ ఇచ్చిన వైద్యులు లేకపోవడంతో వెనుదిరిగారు. దీంతో పీహెచ్‌సీలలో పనిచేస్తున్న నర్సులు సైతం డాక్టర్లు లేరని తాము ఏమీ చేయలేమని చేతులెత్తేశారు.



వైద్యుల్లేక వెలవెలబోతున చిల్లకూరు పీహెచ్‌సీ కేంద్రం



చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేట పీహెచ్‌సీలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి 53 మంది వైద్యులు

జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలో వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెకు దిగడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. ఎస్వీ మెడికల్ కళాశాల నుంచి 53 మంది వైద్యులను, డీసీహెచ్ విభాగం నుంచి సుమారు 36 మంది వైద్యులను జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ ఆసుపత్రులకు తాత్కాలికంగా విధులు నిర్వహించాలని పంపారు. కానీ కనీసం 3 0శాతం మంది వైద్యులు తమకు విధులు కేటాయించిన ఆసుపత్రులకు వెళ్లలేకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వైద్యశాఖాధికారులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తమకు సుదూర ప్రాంతాలలో విధులు కేటాయించి ఎటువంటి మౌలిక సదుపాయాలు కేటాయించలేదని వారు వాపోతున్నారు.

104 పై ప్రభావం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మె బాట పట్టడంతో 104 వైద్య సేవలపై ప్రభావం కనిపించింది. పీహెచ్ సీల్లో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు ఆరోగ్య కేంద్రంలో, మరొకరు 104 సంచార వైద్య సేవలు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. సమ్మె కారణంగా వైద్యులు విధులకు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో కూటమి నేతలు, అధికారులు చెప్పారు. తీరా నిరసన విరమించాక ఏమాత్రం పట్టించుకోలేదు. చంద్రన్న సంచార చికిత్స వాహనంలో తిరిగి సేవలందిస్తున్నందుకు ప్రతి నెలా అదనంగా రూ.5 వేలు చెల్లించాలని కోరుతున్నారు. అందించకపోవడంతో 104 వైద్య సేవలు ఆగిపోయాయి. ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా మిగిలిన అన్ని పీహెచ్‌సీల పరిధిలో 104 వైద్య సేవలకు ఆటంకం కలిగింది. ప్రభుత్వం స్పందించి వైద్యుల డిమాండ్లు పరిష్కరిస్తే గానీ పేదలకు వైద్య సేవలు అందే అవకాశం కానరావడంలేదు. సీజన్ వ్యాధులు వ్యాపించే పరిస్థితుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల డిమాండ్లు ఇవీ....

- సర్వీస్‌లో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్ 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉప దేది. ప్రస్తుం ఈ కోటాను 15.30 శాతానికి కుదించారు.
- ఈ ఏడాది జీఓ నంబర్ 89 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తెర మీదకు తెచ్చారు. దీని ప్రకారం 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా బ్రాంచీలకు మాత్రమే వర్తింపజేసింది. ఈ అన్యాయాన్ని వైద్యులు ఏడాది కాలంగా ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు.



జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

- ఎంబీబీఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టింది. రూ.50 లక్షల ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పని చేస్తామంటూ బాండ్ రాయాలని చెబుతోంది.
- మెడిసిన్ చదివినా ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకుంటోంది.దీనిపై వైద్యవృత్తిలో ఎదుగుదల లేదంటే పీజీ చదవడం దేనికని పీహెచ్‌సీల వైద్యులు ప్రశ్నిస్తున్నారు.
- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న ఎంతో మంది వైద్యాధికారులకు 20 ఏళ్లగా పదోన్నతులు లేవు. వారికి పదోన్నతులు కల్పిస్తామని ఎన్నికల వేళ అసోసియేషన్ నాయకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావిస్తే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైద్యులు ఆరోపిస్తున్నారు.

నామమాత్రంగానే తాత్కాలిక వైద్య సేవలు



చిల్లకూరు మండలంలో వైద్యం కోసం చెట్ల కింద వేచి ఉన్న రోగులు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో వైద్య సేవలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో జిల్లా వైద్యశాఖాధికారులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పీహెచ్‌సీలలో డాక్టర్ల సమ్మె ఉధృతం కావడంతో ప్రత్యామ్నాయంగా జిల్లా అధికారులు తాత్కాలిక వైద్యులను నియమించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులను నియమించినప్పటికీ రోగులు తమకు ఇప్పటికే పరిచయమై వైద్య సేవలు అందించిన వైద్యులు లేకపోవడంతో వెనుదిరగడం కనిపించింది.
- సూళ్లూరు పేట నియోజకవర్గంలో సైతం డాక్టర్ల సమ్మె కారణంగా పీహెచ్‌సీలలో జిల్లా వైద్య శాఖాధికారులు ప్రత్యేకంగా డాక్టర్లు నియమించారు. నియోజకవర్గంలోని 13 నియోజకవర్గాలల్లో వైద్యులను నియమించినప్పటికీ రోగులు రాకపోవడం విశేషం. నాయుడుపేట, దొరవారిసత్రం, ఓజిలి, తడ పీహెచ్‌సీ కేంద్రాలల్లో యథావిధిగా కొనసాగినప్పటికీ గతంలో వచ్చిన విధంగా రోగులు ఆ స్థాయిలో రాలేదు.

–చంద్రగిరి నియోజవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. భాకరాపేట పీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించి ఇంటికి వెనుదిరిగారు. తాత్కాలిక వైద్యులు సైతం పీహెచ్‌సీకి సమయానికి రాకపోవడంతో పేద రోగులు స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలలను సంప్రదించారు. నియోజకవర్గంలోని రామచంద్రాపురం, కుప్పం బాదూరు ప్రాథమిక కేంద్రాలను డీఎంహెచ్ఓ సందర్శించి పరిస్థితి సమీక్షించారు

- **సత్యవేడు, గూడూరులో దారుణం**

గూడూరు మండలం పీహెచ్‌సీలో రోగులు లేక పీహెచ్‌సీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. సాధారణంగా ఒక్కో పీహెచ్‌సీకి రోజుకు సుమారు 100 మందికి పైగా రోగులు వచ్చేవారు. సమ్మెతో కనీసం పదులు సంఖ్యలో కూడా రాలేదు. అలాగే చిల్లకూరు , వల్లిపేడు, చింతవరం, వరగలి పీహెచ్‌సీలో తిరుపతి నుంచి వైద్యులను తాత్కాలికంగా వేసినప్పటికీ ఎక్కడ కూడా వారు బాధ్యతలు చేపట్టలేదు. ఈ ఆసుపత్రిలో సుమారు 80 నుంచి 100 మంది వరకు వైద్య సేవలు పొందుతారు. అలాంటిది పదుల సంఖ్యలో వైద్య సేవలు పొందారు. కోట మండలంలో చిట్టేడు, వాకాడు మండలంలో బాలిరెడ్డి పాలెం చింతోట, వాకాడు మండలంలోని బాలిరెడ్డి పాలెం, చింతోట, నిడుగుర్తిలలో పీహెచ్‌సీలు ఉండగా ఇక్కడ వైద్యులు సమ్మెలో ఉన్నారు. చికిత్స కోసం వచ్చిన రోగులు వెనుదిరగాల్సి వచ్చింది. చిట్టమూరు, మల్లం, గుణపాటి పాలెం, ఈశ్వరవాక పీహెచ్‌సీలు ఉండగా అక్కడా వైద్యులు సమ్మెలో ఉన్నారు. వీరి స్థానంలోకి వైద్య ఆరోగ్య శాఖ తాత్కాలికంగా వైద్యులను పంపి వైద్యం అందిస్తున్నారు. సత్యవేడులోని అన్ని పీహెచ్‌సీ కేంద్రాలలోనూ వైద్యసేవలు స్తంభించి పోయాయి. తూతూ మంత్రంగా కొన్ని కేంద్రాల్లో వైద్యులను నియమించినప్పటికీ రోగులు ఆసుపత్రికి ఆ స్థాయిలో వచ్చిన దాఖలాలు కనిపించలేదు.

కమనీయం.. కల్యాణం



ఉభయ దేవేరులను కల్యాణ మాడిన ప్రసన్న వేంకటేశ్వరుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం కమనీయంగా సాగింది. శ్రీవారి జన్మ నక్షత్రం అయిన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేకువ జాము స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడ్ని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి నూతన వధూవరులుగా తీర్చిదిద్దారు. ఆలయ పండిత బృందం ముందుగా గణపతి హోమం నిర్వహించింది. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య మాంగల్యధారణను కమనీయంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దయాదాక్షిణ్యం లేని టీటీడీ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: మానవసేవే మాధవసేవ అంటూ ప్రతినిత్యం ప్రచారం చేసే టీటీడీ యాజమాన్యం శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలపై కనీసం దయాదాక్షిణ్యం లేకుండా వ్యవహరిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. టీటీడీ పరిపాలన భవనం వద్ద చేపట్టిన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బాధితులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఉపాధిని టీటీడీ దెబ్బతీయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. శేషాచలం అడవులను అక్రమంగా నరికి వేస్తున్న స్మగ్లర్లని వందల మందిని పట్టించిన వారి ఔదార్యాన్ని గుర్తించాలన్నారు. టీటీడీ అధికారులు చిరువ్యాపారుల కడుపు కొట్టడం దారుణమని విమర్శించారు. టీటీడీ పాలకమండలి, యాజమాన్యం తక్షణం స్పందించి శ్రీవారి మెట్టు వ్యాపారుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, యూనియన్ నాయకులు మధు, చిట్టిబాబు, చిరంజీవి, గణేష, యుగంధర్, రాంబాబు, మల్లికార్జున్, ప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల దీక్షలో సీపీఎం నేత బీవీ రాఘవులు

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. గురువారం అర్ధ రాత్రి వరకు 75,188 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,640 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో తిరుమలేశుని దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

తిరుచానూరులో అత్యాధునిక హోటల్

- అట్టహాసంగా లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్ ప్రారంభం

చంద్రగిరి : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అత్యుత్తమ సేవలను అందించేందుకు తిరుచానూరులో అత్యాధునిక హంగులతో హోటల్ ఏర్పాటైంది. తిరుచానూరు సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానంద రెడ్డి, నగిరి ఎమ్మెల్యే గాలి భాను, తిరుపతికి చెందిన పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం హోటల్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించి, ముఖ్య అతిథిలు హోటల్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ... డబుల్ హైట్, గ్రాండ్ డ్రాప్ ఆఫ్, మార్బుల్ ఫినిష్, స్టెయిన్ గ్లాస్ అలంకరణతో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 100 సీట్ల సిగ్నేచర్ రెస్టారెంట్, లైవ్ కిచెన్, బఫేతో పాటు 30 సీట్ల సామర్థ్యం గల అల్ఫ్రెస్కో డైనింగ్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంప్రదాయ రీతిలో వినియోగదారులను ఆకట్టుకునేలా మండపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పోర్ట్స్ బార్, స్పా, మల్టీపర్పస్ హాల్, 500 సీట్ల బ్యాంక్వెట్ హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. వేడుకలను జరుపుకునేందుకు ప్రత్యేకంగా స్థలం, రూఫ్ టాప్ ఇన్ఫినిటీ పూల్‌తో పాటు పవిత్ర తిరుమల దృశ్యాల మధ్య ఆహ్లాదకరమైన వసతులు అందిస్తున్నట్లు తెలిపారు.



నూతనంగా ఏర్పాటైన లెమన్ ట్రీ హోటల్స్ ప్రీమియర్

జీఎస్టీ తగ్గింపుతో కుటుంబాలకు ఆదా

- శ్రీసిటీలో జీఎస్టీపై అవగాహన

శ్రీసిటీ (వరదయ్యపాళెం): రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహిస్తున్న 'సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, కళాకారులు, వ్యాపారులకు వివరించేందుకు శ్రీసిటీలో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీకి చెందిన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, కమ్యూనిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ సంయుక్త డైరెక్టర్ చంద్ర శేఖర్ సమావేశ ఉద్దేశాన్ని వివరించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు సుబ్బారావు, ప్రవీణ్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని నడిపించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భారత్ రెడ్డి హాజరై, ఈ కార్యక్రమం దృక్పథాన్ని వివరించారు. సభను ఉద్దేశించి మాట్లాడిన సుబ్బారావు, సూపర్ జీఎస్టీ ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 15,000 వరకు ఆదా సాధ్యమవుతోందని, వ్యాపార వృద్ధికి ఇది బలాన్ని ఇస్తుందని తెలిపారు. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, ఆరోగ్య సేవలు వంటి 99 శాతం వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడంతో ఈ ప్రయోజనాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 ప్రజా కేంద్రిత విధానాన్ని వివరించారు.



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ సంయుక్త డైరెక్టర్ చంద్ర శేఖర్

శిక్షణా తరగతులు ప్రారంభం

తిరుపతి సిటీ : ఇటీవల జరిగిన డీఎస్సీ–2025లో ఉద్యోగాలు సాధించిన 250 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శుక్రవారం స్థానిక జీవకోన విశ్వం హై స్కూల్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. టీచర్ పోస్టులో చేరడానికి ముందే ఈ తరహా శిక్షణ ఇవ్వడం ఇదే మొదటిసారి అన్నారు. ఎనిమిది రోజుల శిక్షణ కార్యక్రమంలో పాఠశాలలో నూతన ఒరవడిని , నూతన పోకడలు, సబ్జెక్టు సంబంధించిన విషయాలను విషయ నిపుణులతో శిక్షణ పొందాలన్నారు. జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష గౌరీ శంకర్ రావు మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లోనూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని భావి భారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి ఉమామహేశ్వరరావు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ సారథి, విశ్వం విద్యా సంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, ఎంఈఓలు, సీఆర్‌పీలు, పెద్ద సంఖ్యలో నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లీజు ఒకచోట.. తవ్వింది మరోచోట

- క్వారీ యజమానిపై కేసు నమోదు

శ్రీకాళహస్తి : లీజుకిచ్చిన క్వారీ భూమిలో కాకుండా ఏపీఐఐసీ భూమిలో తవ్వకాలు చేపట్టి మెటల్ కొల్లగొట్టిన క్వారీ యజమానిపై అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తొట్టంబేడు మండలంలోని తాటిపర్తి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 129లో మహేశ్వర నాయుడు అనే వ్యక్తికి మహేశ్వర స్టోన్ క్రషర్స్ పేరిట క్వారీ తవ్వకాలకు ప్రభుత్వం లీజు మంజూరు చేసింది. అయితే లీజు భూమిలో కాకుండా పక్కనే ఉన్న ఏపీఐఐసీ (సర్వే నంబర్ 212) భూముల్లో తవ్వకాలు చేపట్టాడు. సుమారు 1.10 లక్షల క్యూబిక్ మీటర్ల రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్‌ను పది మీటర్ల లోతుకు తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయంపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ (తిరుపతి) ఫిర్యాదు చేయగా ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, క్వారీని తనిఖీ చేసి యజమాని మహేశ్వర నాయుడుపై కేసు నమోదు చేశారు.



పరిశీలిస్తున్న అధికారులు

ఇంట్లో చోరీ

సత్యవేడు : స్థానిక కృష్ణయ్యశెట్టి వీధికి చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమెరికాలో ఉన్న తన కుమారుడి వద్దకు కృష్ణమూర్తి వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని విషయం గమనించిన దొంగలు లోపలికి చొరబడ్డారు. బీరువా పగుల గొట్టి 80 గ్రాముల బంగారం, 7కేజీల వెండి, రూ.60 వేల నగదును అపహరించినట్లు కృష్ణమూర్తి బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్

నారాయణవనం : విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుని కీళగరం బీసీ కాలనీకి చెందిన పెరుమాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది కీళగరం పంచాయతీ జగనన్న కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 4.9 టన్నుల బరువు ఉన్న 98 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి



చెంచురామయ్య మృతదేహం

సత్యవేడు: స్థానిక బలిజ వీధికి చెందిన చెంచురామయ్య(45) శుక్రవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బావిలో దిగి కాలు జారడంతో నీట మునిగి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేశారు.